క్లుప్తంగా

శింగరకొండ దర్శిని



అద్దంకి: క్రోధి నామ సంవత్సరం , ఉత్తరాయణం జ్యేష్ఠ మాసం రేవతి నక్షత్రం నవమి తిథి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం , మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

కౌలు కార్డుతో ఎన్నో ప్రయోజనాలు

అద్దంకి: కౌలు కార్డులతో ఎన్నో ప్రయోజనాలున్నాయని మండల వ్యసాయాధికారి కొర్రపాటి వెంకట కృష్ణ అన్నారు. గురువారం మండలంలోని కలవకూరు, శింగరకొండపాలెం రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతు కార్డులున్న రైతులకు ప్రభుత్వ పథకాలు అందుతాయని చెప్పారు. ప్రతి కౌలు రైతు కౌలు రైతు కార్డులను తీసుకోవాలని చెప్పారు. ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

5న జాతీయ లోక్ అదాలత్

అద్దంకి: స్థానిక కోర్టులో జూలై 5వ తేదీన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి నాగ వెంకటలక్ష్మి గురువారం తెలిపారు. ఈ అదాలత్ కార్యక్రమంలో రాజీ చేసుకోదగిని అన్ని సివిల్, క్రిమినల్ కేసులు రాజీ చేసుకోవచ్చని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా రాజీ చేసుకున్న కేసుల్లో ఇరు పక్షాలు గెలిచినట్లేనని తెలిపారు. అదాలత్ ద్వారా పరిష్కరించుకున్న కేసులకు అప్పీలు ఉండదని తెలిపారు. కేసుకు సంబంధించి కోర్టులో చెల్లించిన ఫీజును సైతం వాపసు ఇస్తామని తెలిపారు. ఈ సదవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకుని కేసు రాజీ చేసుకోవాలని కోరారు.

ట్రై సైకిల్ కోసం దరఖాస్తు చేసుకోండి

మార్టూరు: అర్హత కలిగిన దివ్యాంగులు బ్యాటరీ చార్జింగ్ సహాయంతో నడిచే త్రీ వీలర్ మోటార్ సైకిళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని మార్టూరు మండల ఏపీఎం బాచిన సురేంద్ర బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ట్రై సైకిల్స్ కావాల్సిన దివ్యాంగులు నడుము కింది భాగం పని చేయకుండా ఉండి, రెండు చేతులు పనిచేస్తున్న వారు దరఖాస్తు చేయడానికి అర్హులని తెలిపారు. 80 శాతం అంగవైకల్యం కలిగి ఉన్నట్లు సదరం సర్టిఫికెట్, ఆధార్, రేషన్ కార్డు, ఐడీ కార్డు జెరాక్సుతో పాటు వికలత్వం ఫొటోతో మార్టూరు వెలుగు కార్యాలయంలో శనివారం లోపు తనకు అందజేయాలని సురేంద్రబాబు తెలిపారు. మండలంలోని అర్హులైన దివ్యాంగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కారంచేడు ఘటనతోనే అట్రాసిటీ యాక్టు

చీరాల రూరల్: కారంచేడు గ్రామంలో అగ్రవర్ణాలు జరిపిన దారుణమారణ కాండలో అశువులుబాసిన మృతవీరుల అనంతరం జరిగిన ఉద్యమాల వల్లే దేశంలో ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ యాక్టు ఆరంభమైందని కారంచేడు బాధిత పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. కారంచేడు ఘటన జరిగి జూలై 17తో నాలుగు దశాబ్దాలు పూర్తిచేసుకోనున్నందున 40వ సంస్మరణ సభ విజయవంతం చేయాలని కోరుతూ గురువారం నాయకులు విజయనగర్ కాలనీలోని మృతవీరుల రుధిర క్షేత్రం వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ప్రజలను ఆహ్వానించి సంస్మరణ సభ జరిపేందుకు నిర్ణయించినట్లు చెప్పారు. ఈ ఘటన జరిగిన తరువాత ఉద్యమాల పోరాట ఫలితంగా నేడు దళితులు ఆత్మగౌరవంతో బతకటానికి మూల కారణమయ్యిందని, సామాన్య అణగారిన ప్రజలపట్ల దౌర్జన్యాలను, దుర్మార్గాలను ప్రశ్నించటానికి కారంచేడు ఉద్యమం స్ఫూర్తి నింపిందని పేర్కొన్నారు. కార్యనిర్వహణ కమిటీ సభ్యులు దుడ్డు భాస్కరరావు, తేళ్ల వెంకటస్వామి, బుడంగుంట్ల లక్ష్మీనరసయ్య, గొర్రెపాటి రవికుమార్, గ్రామ పెద్దలు తేళ్ల ప్రసాద్, తేళ్ల చైతన్య, దుడ్డు వందనం, తేళ్ల రాంబాబు, పిల్లి వెంకటేష్, దుడ్డు చక్రవర్తి, తేళ్ల వంశీ పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

మార్టూరు : లారీ ఢీకొని ఓ వ్యక్తి గాయపడిన సంఘటన గురువారం రాత్రి మార్టూరు జాతీయ రహదారిపై జరిగింది. 108 సిబ్బంది కోటేశ్వరమ్మ వివరాలు ఇలా ఉన్నాయి. మార్టూరు కు చెందిన పఠాన్ హుస్సేన్ నమాజ్ కు వెళ్లి తిరిగి సర్వీస్ రోడ్ లో బైకు పై వస్తూ స్థానిక హీరో షోరూం ఎదురు రహదారి పైకి వెళ్లే ప్రయత్నంలో ఉన్నాడు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై వెళ్తున్న లారీ హుస్సేన్ ను ఢీ కొట్టింది. ప్రమాదంలో రోడ్డుపై పడిన హుస్సేన్ గాయపడ్డాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా బాధితుడి బంధువులు హుస్సేన్ను మెరుగైన చికిత్స నిమిత్తం చిలకలూరిపేటప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

యోగాతో శారీరక రుగ్మతలు దూరం



పర్చూరు ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో యోగా చేస్తున్న విద్యార్థులు



కరపత్రం ప్రదర్శిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పర్చూరు(చినగంజాం): రోజూ యోగా చేయడం వలన మానసిక, శారీరక రుగ్మతల నుంచి విముక్తి లభిస్తుందని యోగ మాస్టర్ ట్రైనర్, మండల యోగా పర్యవేక్షణాధికారి, ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో డాక్టర్ దాసరి చంద్రశేఖర్ సూచించారు. మండలంలోని ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్, నాగులపాలెం బధిరుల పాఠశాల, శాతవాహన హైస్కూల్,డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, నూతలపాడు ఎంపీపీఎస్, విజ్ఞాన్ హైస్కూల్, వృద్ధాశ్రమంలో మొత్తం 1000 మంది విద్యార్థులు, వృద్ధులకు గురువారం యోగాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజూ యోగా చేయడం ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్య వంతులుగా మారవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో నూతలపాడు ఆయుర్వేద వైద్యులు డాక్టర్ డి. శ్రీనివాసరావు, ఎంఈఓ 2 పి. వెంకట రామయ్య పాల్గొన్నారు.

రేపటి నుంచి యోగ శిక్షణ

వేటపాలెం: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణలో ఈ నెల 21వ తేదీ నుంచి ఉచిత ధ్యాన, యోగ శిక్షణ క్లాసులు నిర్వహించనున్నట్లు యోగా గురుజీ తిరుమలశెట్టి సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక జీడీపప్పు షాపులో ఉచిత యోగా కరపత్రాలు గురువారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉచితంగా యోగా క్లాసులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 5 గంటలకు క్లాసులు ఉంటాయని తెలిపారు. క్లాసుల్లో యోగ, ప్రాణాయామం, సూర్యనమస్కారం, ఆహార నియమాలు, సంప్రదాయలు, మానవీయ విలువులు, వ్యక్తిత్వ వికాసం నేర్పించ నున్నట్లు తెలిపారు. ఉచిత యోగా కార్యక్రమానికి పురుషులు స్త్రీలు, విద్యార్థులు పాల్గొన వచ్చుని తెలిపారు. ప్రత్తి ముత్తుకుమర్, శ్రీరాం గోవర్ధన్, ఆకుల ప్రసాద్, గాయత్రీ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌కు అనుమతి ఇవ్వండి

- విద్యార్థులతో పాఠశాల వద్ద నిరసన
- ఎంఈవోలకు వినతి పత్రాలతో వేడుకోలు



చిన అంబడిపూడి పాఠశాల వద్ద విద్యార్థులతో తల్లిదండ్రులు నిరసన

బల్లికురవ: పాఠశాలలో 60 మంది పైగా విద్యార్థులు చదువుకుంటున్నారని 1 నుంచి 5 తరగతుల ఏర్పాటుతో మోడల్ స్కూల్‌కు అనుమతి ఇవ్వాలని చిన అంబడిపూడి పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవోలకు వినతి పత్రాలు అందజేశారు. వివరాల్లోని వెళితే.. చిన అంబడిపూడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గతంలో 60 మంది పైగా విద్యార్థులు చదువుసాగిస్తున్నారు. విలీనం పేరుతో గతంలో 3,4,5 తరగతులను హైస్కూల్ కలిపి ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన జరిగేది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ విద్యా సంవత్సరం నుంచి విలీనాన్ని రద్దు చేసి మోడల్ స్కూల్‌గా ఎంపిక చేశారు. అయితే చిన అంబడిపూడి పాఠశాలలో విద్యార్థులున్న మోడల్ స్కూలుగా ఎంపిక చేయకుండా కిలో మీటన్నర దూరంలోని పెదఅంబడిపూడి గ్రామంలోని హెచ్‌సీ పాఠశాలలో 3,4,5 తరగతులు చదివేలా మార్పు చేశారు. అంతదూరం తమ బిడ్డలను పంపలేమని విద్యార్థుల తల్లిదండ్రులు కోవూరి నాగరాజు, ప్రసన్న, పల్లపు వెంకటేష్ అనూష, కోమలి, ×సాక్షి×కి తెలిపారు. మోడల్ స్కూల్‌గా ఎంపికతో 1 నుంచి 5 తరగతులు ఇక్కడే నిర్వహిస్తూ ఉపాధ్యాయులను నియమించాలని ఎంఈవోలు వస్రం నాయక్, రమేష్‌బాబులకు వినతి పత్రాలు అందజేశారు. జిల్లా అధికార్లుకు నివేదిస్తామని ఎంఈవోలు హామీ ఇచ్చారు.

ప్రభుత్వ పథకాలు అందుకోండి



రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ సింగారావు

జె.పంగులూరు: ఎల్‌పీఎంలు ఉన్న ప్రతి రైతు జాయింట్ విడగొట్టుకొని ప్రభుత్వ పథకాలు పొందేవిధంగా చూసుకోవాలని తహసీల్దార్ సింగరావు అన్నారు. మండల పరిధిలోని పంగులూరు మండల తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదల కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు అర్హులై ఉండి, రైతులు జాయింట్ పేర్లు ఎక్కువ ఉన్నట్లు చూపిస్తోందన్నారు. రైతులకు జాయింట్‌గా పొలం ఆన్‌లైన్ కావడం వలన వారు అనర్హులుగా పరగణిస్తున్నారని తెలిపారు. అలాంటి వారు వారి పరిధిలోని సచివాలయంలోని విలేజ్ సర్వేయర్‌ను కలిసి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎల్‌పీఎంలు విడగొట్టి 10 రోజుల్లో సింగిల్ ఎల్‌పీయంలుగా మార్చాలని తెలిపారు.

ప్రీ స్కూల్ విద్యపై శ్రద్ధ తీసుకోండి



అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సులోచన రాణి

ఇంకొల్లు(చినగంజాం): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ప్రీ స్కూల్ విద్యకు సంబంధించి పూర్తి శ్రద్ధ తీసుకుని వారిని సంసిద్ధులను చేయాలని ఇంకొల్లు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ సులోచనారాణి సూచించారు. గురువారం ఇంకొల్లు మండల పరిధిలోని మూడు సెక్టార్ల అంగన్ వాడీ వర్కర్‌లకు అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్ వాడీ కేంద్రంలోని రిజిస్టర్‌ల నిర్వాహణపై శిక్షణ ఇవ్వడంతో పాటు చిన్నారుల పెరుగుదలపై పూర్తి పర్యవేక్షణ ఉంచాలన్నారు. దాంతో పాటు ప్రీ స్కూల్ విద్యపై పూర్తిగా శ్రద్ధ తీసుకొని చిన్నారులను బడిలో చేర్పించేందుకు రెగ్యులర్ విద్యకు అలవాటు పడేలా చేయాలని సూచించారు. ఇందులో భాగంగా ఇడుపులపాడు, పావులూరు, ఇంకొల్లు సెక్టార్‌ల కార్యకర్తలకు ఆమె శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల సూపర్ వైజర్‌లు లీల, బేబి, వాణి, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సిమెంటు దిమ్మెను ఢీ కొన్న కారు



పి.గుడిపాడు వద్ద సిమెంటు దిమ్మెను ఢీ కొన్న కారు

మేదరమెట్ల: కారు టైరు పగలడంతో అదుపు తప్పిన కారు సిమెంటు దిమ్మెను ఢీ కొంది. ఈ సంఘటన కొరిశపాడు మండలంలోని పి.గుడిపాడు జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. ఏలూరు నుంచి ఒంగోలు వైపు వస్తున్న కారు పి.గుడిపాడు జాతీయరహదారి సమీపానికి రాగానే కారు టైరు పగిలిపోయింది. దీంతో అదుపు తప్పిన కారు డివైడర్ కోసం ఉంచిన సిమెంటు దిమ్మెను బలంగా ఢీ కొంది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం పూర్తిగా దెబ్బతినగా కారులో ఉన్న ఇద్దరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ఎస్‌హెచ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును స్థానిక పోలీసులకు తెలిజేయగా.. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకున్నారు.

ఓటరు క్లైమ్‌ల విచారణ

చీరాల టౌన్: నియోజకవర్గంలోని చీరాల మున్సిపాలిటీ, చీరాల రూరల్ మండలం, వేటపాలెం మండలాల్లో పెండింగ్‌లో ఉన్న ఓటరు క్లైమ్‌ల విచారణను పటిష్టంగా చేస్తున్నామని చీరాల ఆర్డీవో, ఎన్నికల అధికారి తూమాటి చంద్రశేఖర నాయుడు తెలిపారు. గురువారం చీరాల తహసీల్దార్ కార్యాలయంలో అన్నీ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఓటరు క్లైమ్‌ల ఫారం 6, 7, 8లు మొత్తం 129 అర్జీలు విచారణ చేస్తున్నామన్నారు. ఓటరు క్లైమ్‌ల విచారణకు అన్ని రాజకీయ పార్టీల పర్యవేక్షించుకోవచ్చని తెలిపారు. ప్రతి బూత్ లెవల్ ఆఫీసర్ వద్ద క్లెయిమ్‌లు ఉన్నాయని ప్రతీ ఫారంను అన్ని విధాలుగా విచారణలు చేస్తున్నామని, మృతి చెందిన ఓటర్లను జాబితాను తొలగించడం, ఇతర సవరణలను సక్రమంగా చేయిస్తున్నామన్నారు. ఓటరు క్లైమ్‌ల విచారణ సత్వరంగా చేసి జాబితాల్లో పొందుపరుస్తున్నామని ఆర్డీఓ వివరించారు. తహసీల్దార్ కె.గోపికృష్ణ, డీటీ సుశీల, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో సూచనలందిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర నాయుడు

విద్యుత్ అదాలత్‌లో సమస్యల పరిష్కారం



విద్యుత్ అదాలత్‌లో పాల్గొన్న విద్యుత్ శాఖాధికారులు

పర్చూరు(చినగంజాం): విద్యుత్ వినియోగదారుల అదాలత్ గురువారం పర్చూరు రోటరీ క్లబ్ భవన్‌లో సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యుత్ సమస్యలకు సంబంధించి 13 వినతి పత్రాలు అందగా వాటిలో 10 వినతులకు సంబంధించి సమస్యలను సత్వరం పరిష్కరించినట్లు చీరాల విద్యుత్ డీఈఈ జాన్ బాషా తెలిపారు. కార్యక్రమంలో పర్చూరు డీఈఈ శ్రీనివాసులు, ఏఈ రమేష్ నాయక్ పాల్గొన్నారు.

23న మండల సమావేశం

బల్లికురవ: మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె. కుసుమకుమారి గురువారం ఒక ప్రకటలో తెలిపారు. ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగే సమావేశంలో శాఖల వారీగా సమీక్షిస్తామన్నారు. సభ్యులు, సర్పంచ్‌లు మండలస్థాయి అధికారులు, విధిగా సకాలంలో హాజరు కావాలని ఎంపీఈఓ కోరారు.

ఘనంగా నగరోత్సవం

చీరాల అర్బన్: పట్టణంలోని వీరరాఘవపేటలోని శ్రీసీతారామ మందిర వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి స్వామివార్ల నగరోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో, పూల అలంకరణలో స్వామివారి ఉత్సవమూర్తులను హనుమత్ వాహనంపై పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. పూజా కార్యక్రమాలను అర్చకులు దిట్టకవి వాసుదేవ సంపత్‌కుమార్ ఆచార్యులు నిర్వహించారు. కార్యక్రమాలను శ్రీరామమందిర పాలకవర్గ సభ్యులు పర్యవేక్షించారు. శుక్రవారం శ్రీలక్ష్మీ అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సీతారామస్వామి వార్ల నగరోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

వెంకయ్య మాస్టారు మృతి



వంకాయలపాటి వెంకయ్య

పర్చూరు(చినగంజాం): విశ్రాంత సైన్సు ఉపాధ్యాయుడు వంకాయలపాటి వెంకయ్య మాస్టారు(93) గురువారం మృతి చెందారు. అన్నంబొట్ల వారిపాలెంలోని ఆయన స్వగృహంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. స్థానిక వైఆర్ హైస్కూల్‌లో 35 ఏళ్ల పాటు ఆయన సైన్స్ ఉపాధ్యాయునిగా పని చేశారు. వెంకయ్య మాస్టారుగా ఆయన పర్చూరు మండలంలోని చుట్టు పక్కల గ్రామాల్లో సుపరిచితులు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈయన మృతి పట్ల ప్రముఖులు, పూర్వ విద్యార్థులు దిగ్భ్రాంతి వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. చాగంటి చెంచుబాబు, కాసా అశోక్, తేళ్ళ రమేష్, షేక్ చాంద్ బాషా, పాబోలు ఉదయభాస్కర్, తాళ్ళూరి శ్రీనివాసరావు, షేక్ హబీబుల్లా, గుమ్మా సురేంద్ర, షేక్ ఖాజావలి, అడుగుల శ్రీనివాసరావు, కాల్వ సోమశేఖర్, కాల్వ హరి, వైఆర్ హైస్కూల్ సిబ్బంది నివాళులర్పించారు.

బైక్‌పై నుంచి కిందపడి యువతికి గాయాలు

బల్లికురవ: రోడ్డు ప్రమాదంలో ఓ యువతి తలకు గాయాల పాలైంది. ఈఘటన గురువారం బల్లికురవ-కొణిదెన గ్రామాల మధ్య జరిగింది.. అందిన సమాచారం ప్రకారం మండలంలోని వల్లాపల్లి గ్రామానికి చెందిన ముట్లూరు జయమ్మ బైక్‌పై కొణిదెన గ్రామం వెళ్లి తిరిగి వస్తుండగా కింద పడి తలకు గాయం కావడంతో ఈప్రమాదం సంభవించింది. స్థానికులు బల్లికురవ 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో ఈఎంటీ పిచ్చయ్య, పైలట్ రామాంజనేయులు ప్రథమ చికిత్స తదుపరి ఉన్నత చికిత్సకు అద్దంకి వైద్యశాలకు తరలించారు.

గుండెపోటుతో సర్పంచ్ మృతి



మృతురాలు కొప్పరపాలెం సర్పంచ్ (ఫైల్)



సర్పంచ్ భర్తను పరామర్శిస్తున్న హనిమిరెడ్డి సోదరులు

బల్లికురవ: గుండెపోటుతో మండలంలోని కొప్పరపాలెం సర్పంచ్ వల్లం రెడ్డి అమల(60) గురువారం అకాలమరణం చెందారు. 2021 నుంచి సర్పంచ్‌గా అమల ఆమెభర్త అంజిరెడ్డి కూడా గ్రామాభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. తెల్లవారుజామున సుమారు 2 గంటల ప్రాంతంలో ఛాతీలో నొప్పితో అస్వస్థతకు గురై మరణించారు. ఓ కుమారుడు, ముగ్గురు కుమార్తె ఉన్నారు.

హనిమిరెడ్డి సోదరుల పరామర్శ

సర్పంచ్ భౌతికకాయానికి అద్దంకి వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడి సోదరులు, నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి నివాళులర్పించారు. ఆమె భర్త అంజిరెడ్డి, కుమారుడు, కుమార్తెలను పరామర్శించి ఓదార్చారు. వీరివెంట మండల పార్టీ కన్వీనర్ దేవినేని కృష్ణబాబు స్థానిక నేతలు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి పర్యటనలతో విజ్ఞానం పెంపు



వేరుశనగ పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులుల

చీరాల టౌన్: వ్యవసాయ కళాశాలలో విద్యనభ్యసించే విద్యార్థులకు క్షేత్ర స్థాయి పర్యటనలు, పంటల పరిశీలనలు చేయడం వలన విజ్ఞానం పెంపొందుతుందని వైఎస్సార్ సీపీ రైతు విభాగం అధ్యక్షుడు కె.రమణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కావూరివారిపాలెంలో సాగు చేస్తున్న వేరుశనగ పంట పొలాలను బాపట్ల వ్యవసాయ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు పంటల పరిశీలన చేశారు. వేరుశనగ సాగులో పంటలకు వచ్చే తెగుళ్ల నివారణకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ అపర్ణ వివరించారు. విద్యార్థులు, ఆయా గ్రామాల్లోని రైతులు పాల్గొన్నారు.

తీరంలో వరాహాలు.. పర్యాటకులు బెంబేలు



తీరం ఒడ్డున గుంపులుగా సంచరిస్తున్న వరాహాలు

చీరాల టౌన్: నిత్యం మత్స్యకారులు, పర్యాటకులతో కిటకిటలాడే వాడరేవు సముద్ర తీరం వరాహాలకు నిలయంగా మారింది. తీరం ఒడ్డున వరాహాలు గుంపులుగా స్వైర విహారం చేస్తుండటంతో అటు మత్స్యకారులు, ఇటు తీరానికి వస్తున్న పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జనసంచారం అధికంగా ఉండే తీరం ఒడ్డున చేపల అమ్మకాలు చేసే ప్రదేశంతో పాటు పర్యాటకులు వేచి ఉండే ప్రాంతాల్లో గుంపులుగా తిరుగుతు ఇబ్బందులకు గురిచేస్తున్నాయని వాపోతున్నారు. వరాహాల వలన తమ వ్యాపారాలతో పాటుగా పర్యాటకులను ఇబ్బందులకు గురి చేస్తున్న వీటిని గ్రామానికి దూరంగా పంపించాలని మత్స్యకారులు, పర్యాటకులు కోరుతున్నారు.

సమైక్య సంఘాల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఈపీఎం జ్యోతి ప్రసాద్ బాబు

జె.పంగులూరు: డ్వాక్రా మహిళలు తీసుకునే అనేక రకాల రుణాల రికవరీలో గ్రామ సంఘాల పాత్రం కీలకంగా ఉండాలని.. పంగులూరు ఏపీఎం జ్యోతి ప్రసాద్‌బాబు అన్నారు. డ్వాక్రా మహిళలకు సమైఖ్య సంఘాల ద్వారా అనేక రకాల రుణాలు ఇస్తున్నామని సీఏఎఫ్, స్త్రీ నిధి, ఉన్నతి వంటి పథకాల ద్వారా ఇచ్చే రుణాలు సకాలంలో వసూలు చేయించుకోవాలని, కొత్త వారికి రుణాలు ఇచ్చేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గ్రామ ఐక్య సంఘాలు, మండల సమైక్యం ఇందులో కీలక పాత్ర పోషించాలని కోరారు. రుణాలు వసూళ్ల ఎంత వేగంగా జరిగితే అంత వేగంగా రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. సూర్య ఘర్ రిజిస్ట్రేషన్లు బీసీ, ఓసీలకు సమైక్య సంఘాల ద్వారా రిజిస్ట్రేషన్లు చేయాలి ఎక్కువ మంది మహిళలను ఇందులో పాల్గొనే విధంగా చేయాలని ప్రసాద్ కోరారు. కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ నాగశంకర్, సీసీలు చంద్రశేఖర్, సురేష్, సాల్మన్ మండల సమైఖ్య అధ్యక్షులురాలు బత్తుల మాధవి, కార్యదర్శి కమలాదేవి గ్రామాలకు చెందిన గ్రామవాహిక సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారాతో జీవితాలు ఛిద్రం



ఎక్సైజ్ పోలీసులుతో మాట్లాడుతున్న గ్రామ ప్రజలు

చీరాల: నాటుసారా జీవితాలను విచ్ఛిన్నం చేస్తుందని, గ్రామాల్లో నాటుసారా తయారీ, వినియోగాన్ని తగ్గించాలని ఎక్సైజ్ సీఐ పి.నాగేశ్వరరావు అన్నారు. గురువారం చీరాల మండలంలో నాటుసారా తయారీలో 'ఏ' క్యాటగిరీ గ్రామాలైన రామ్ నగర్, ఆదినారాయణపురం గ్రామాలను సందర్శించి అక్కడి గ్రామ పెద్దల సమక్షంలో మాట్లాడారు. నాటుసారా వలన కలిగే నష్టాలను వివరించగా అక్కడ గ్రామ ప్రజలు, పెద్దలతో కలిసి ఇక గ్రామంలో నాటుసారా వినియోగం, ఉత్పత్తి నివారించేందుకు తమకు ప్రభుత్వం ద్వారా జీవనోపాధి కల్పించేందుకు సహకరించాలని కోరారు. ఈ విషయాన్ని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విన్నవించారు. డీఆర్‌డీఏ పీడీకి గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేయగా కలెక్టర్ దృష్టికి తీసుకెళతానన్నారు. ఎక్సైజ్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.